మాట నెగ్గించుకున్నారు....

- వార్డు సచివాలయ ఉద్యోగుల బదిలీల్లో సిఫార్సులకే ప్రాధాన్యం
- పోస్టింగ్ కోసం ముడుపులు సమర్పించుకున్న సిబ్బంది
- మెడికల్ గ్రౌండ్స్ ఉన్నా ప్రాధాన్యం ఇవ్వలేదు
- లబోదిబోమంటున్న సిఫార్సు లేఖలు లేని ఉద్యోగులు


ఆప్షన్ ఫాం ఇస్తున్న సచివాలయ ఉద్యోగులు(ఫైల్)

నెహ్రూనగర్: వార్డు సచివాలయ ఉద్యోగుల బదిలీలు నిరాశ మిగిలింది. ప్రజాప్రతినిధులు మాట నెగ్గించుకున్నారు. సిఫార్సుల లేఖలకు, ముడుపులకు మాత్రమే ప్రాధాన్యం దొరికింది. మిగిలిన వారికి ఆప్షన్ ఇవ్వని సచివాలయాలకు కూడా బదిలీ చేశారు. వార్డు సచివాలయాల్లో పనిచేస్తున్న ఉద్యోగుల బదిలీలకు సంబంధించిన కౌన్సెలింగ్ ప్రక్రియ గత నెల 28, 29వ తేదీల్లో గుంటూరు నగరంలోని శ్రీ వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో చేపట్టారు. అయితే ఈ బదిలీల్లో కేవలం సిఫార్సు లేఖలకు, ముడుపులు సమర్పించుకున్న వారికి మాత్రమే వారు అనుకున్న సచివాలయాలు కేటాయించబడ్డాయి. ప్రస్తుతం వార్డు ఎమినిటీ సెక్రటరీలు, ప్లానింగ్ సెక్రటరీలకు సంబంధించిన బదిలీల ప్రక్రియకు సంబంధించిన అధికారిక ఉత్తర్వులు ఇచ్చారు. ఇక కమిషనర్ సచివాలయం కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేయడమే తరువాయి. ఇంకా వెల్ఫేర్ సెక్రటరీలు, వార్డు అడ్మిన్ సెక్రటరీలు, ఎడ్యుకేషన్ అండ్ డేటా ప్రాసెసింగ్ శానిటేషన్ సెక్రటరీలకు సంబంధించిన ఉత్తర్వులు బయటకు రాలేదు. ప్రస్తుతం పింఛన్లు పంపిణీ పూర్తి చేసిన తరువాతే బదిలీలు చేపట్టాలని ఉత్తర్వులు ఇవ్వాలని ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ నెల 4వ తేదీలోగా బదిలీల ప్రక్రియ పూర్తి చేసి 5వ తేదీ నాటికి కేటాయించిన సచివాలయంలో విధుల్లో హాజరు కావాలనే స్పష్టమైన ఆదేశాలు ఉన్నాయి.

మెడికల్ గ్రౌండ్స్ నిబంధనలకు పాతర!

వార్డు సచివాలయ సెక్రటరీల బదిలీల్లో దివ్యాంగులకు, విజువల్లీ ఛాలెంజ్డ్ సిబ్బందికి, మెడికల్ గ్రౌండ్స్(క్యాన్సర్, హార్ట్ సర్జరీ, కిడ్నీ మార్పిడి వంటి వ్యాధులకు), మానసిక వ్యాధుల కలిగిన పిల్లల తల్లిదండ్రులకు, స్పౌజ్ కేటగిరి వారికి మొదటి ప్రాధాన్యం ఇవ్వాల్సి ఉండగా వాటికి ప్రాధాన్యం ఇవ్వలేదని కొంత మంది ఉద్యోగులు ఆరోపిస్తున్నారు. గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో కొంత మంది ఉద్యోగులు దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్నప్పటికీ వారు ఇచ్చిన ఆప్షన్ కాకుండా వేరే సచివాలయం కేటాయించడంపై మండిపడుతున్నారు. ఇంకా ప్రభుత్వ నిబంధనలు అధికారులు ఎక్కడ పాటించరంటూ పలువురు సెక్రటరీలు అధికారుల తీరుపై మండిపడుతున్నారు.

> **నిబంధనల ప్రకారమే బదిలీలు**
>
> నగరపాలక సంస్థ పరిధిలో బదిలీలకు సంబంధించిన ప్రక్రియ పూర్తి పారదర్శకంగా నిబంధనల మేరకు జరిగాయి. ఉద్యోగాల నుంచి ఆప్షన్స్ తీసుకుని వారి వారి అర్హతలను, సీనియార్టీ బట్టి నివేదికలను ఆర్‌డీఎంఏ, ఆర్‌డీటీపీకి, పబ్లిక్ హెల్త్ ఎస్ఈ నెల్లూరుకు పంపాం. వారే బదిలీలకు సంబంధించిన ఉత్తర్వులు జారీ చేస్తారు.
>
> – చల్లా ఓబులేసు, అదనపు కమిషనర్

ప్లానింగ్ సెక్రటరీలకు మంచి డిమాండ్!

నగరంలో ప్లానింగ్ సెక్రటరీలకు మంచి డిమాండ్ ఉంది. అనధికార కట్టడాలను నివారించే ప్రక్రియలో కీలక ప్రాత పోషిస్తున్న ప్లానింగ్ సెక్రటరీలకు తమ అనుకునే సెక్రటరీలను తమకు అనుకూలమైన సచివాలయంలో ప్రజాప్రతినిధులు పోస్టింగ్ ఇప్పించుకుంటున్నారు. అనధికార నిర్మాణాలు జరిగితే అక్కడ వాలిపోయి వారి నుంచి భారీ స్థాయిలో మామూళ్ల వసూలు చేసేందుకు తమకు అనుకూలమైన సెక్రటరీలకు టౌన్ ప్లానింగ్ అధికారులు దగ్గరుండి బదిలీ చేయించుకున్నట్లు ఆరోపణలున్నాయి. ఇందులో ప్రధానంగా గోరంట్ల ప్రాంతానికి ఎక్కువ మంది పోటీ పడ్డారు. కొంత మంది ప్లానింగ్ సెక్రటరీలు రూ.50 వేలు దాకా ముడుపులు సమర్పించుకుని గోరంట్ల ప్రాంతానికి వెళ్లినట్లు సమాచారం. మామూలుగా 5 ఏళ్లు దాటిన వారే బదిలీలకు అర్హులు. 5 ఏళ్ల లోపు సర్వీస్ ఉన్న వారు రిక్వెస్ట్ మీద బదిలీలు చేసుకునేందుకు ప్రభుత్వం అవకాశం ఇచ్చింది. అయితే కొంత మంది ప్లానింగ్ సెక్రటరీలు రిక్వెస్ట్ లెటర్లు ఇవ్వకుండానే బదిలీలు అయినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

డెప్యూటేషన్‌పై వెళ్లిన వారికి నో ఛాన్స్

వార్డు సచివాలయ ఉద్యోగులుగా పనిచేస్తూ డెప్యూటేషన్‌పై వివిధ శాఖలకు బదిలీలపై వెళ్లాలని కొంత మంది అక్కడ పనిచేయడం ఇష్టం లేక సచివాలయానికి వచ్చేందుకు బదిలీల కౌన్సెలింగ్ వచ్చినప్పటికి వారికి బదిలీ అయ్యే అవకాశం కల్పించకపోవడంపై మరికొంత మంది సెక్రటరీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా హౌసింగ్, సీఆర్‌డీఏ, సీడీఎంఏ కార్యాలయాల్లో బదిలీలపై వెళ్లిన వారు అక్కడే విధులు నిర్వహించాలని సూచించడంతో చేసేదేమి లేక ఉద్యోగులు మిన్నకుండిపోయారు.

రెవెన్యూ వార్డు సచివాలయాలపై కన్ను

వార్డు సచివాలయ వ్యవస్థలో వార్డు అడ్మిన్ స్ట్రేటివ్ సెక్రటరీలు ట్యాక్స్‌లు వేయడంలో.. అడిషనల్ అల్ట్రేషన్(పన్ను తగ్గింపు)లో కీలకంగా వ్యవహరిస్తుంటారు. ఈ క్రమంలో రెవెన్యూ ఆదాయం వచ్చే వార్డులకు తమ అనుకునే వార్డు అడ్మిన్ సెక్రటరీలకు అధికారులు పోస్టింగ్‌లు ఇప్పించుకున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ బదిలీల ప్రక్రియ అంతా కూడా అధికారులు తమ ఇష్టానుసారంగా వ్యవహరించరంటూ సచివాలయ ఉద్యోగులు తమ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రైతు బాంధవుడు డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి

గుంటూరు ఎడ్యుకేషన్: రైతులకు అండగా నిలిచి, వారి సంక్షేమం కోసం పాటుపడిన రైతు బాంధవుడిగా డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి చరిత్రలో చిరస్థాయిలో నిలిచిపోయారని ఉయ్యూరుకు చెందిన రైతు, సామాజిక కార్యకర్త అనగాని రామ్‌ప్రసాద్ పేర్కొన్నారు. గుంటూరుకు చెందిన అవర్ స్టేట్ అవర్ లీడర్ ఇంటిలెక్చ్యువల్ ఫోరమ్ అధ్యక్షుడు జి.శాంతమూర్తి ఆధ్వర్యంలో మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి జయంతి వారోత్సవాల్లో భాగంగా బుధవారం "దేశానికి వెన్నెముక రైతు" అనే అంశంపై జూమ్ వేదికగా సదస్సు నిర్వహించారు. రామ్‌ప్రసాద్ మాట్లాడుతూ రైతు తన రక్తాన్ని చెమటగా చిందించి అందరి ఆకలి తీర్చే వరం వ్యవసాయమనే విషయాన్ని గుర్తించాలని, పెట్టుబడి సాయం అందక, ప్రభుత్వ ఆదరణ లేక రుణదాతల మాటలు భరించలేక భవిష్యత్తు పై ఆశలు లేక అన్నదాతలు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తన తండ్రి సైతం అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్నట్లు చెప్పారు. నాడు దిక్కుతోచని స్థితిలో ఉన్న రైతులకు అండగా నిలిచి ధైర్యం చెప్పిన మానవతావాది డాక్టర్ వైఎస్సార్ రైతు బాంధవుడిగా, ప్రజల ఆరోగ్యం, అభివృద్ధి, సంక్షేమం కోరుకునే నేతగా పరిపాలన చేశారని కొనియాడారు. కార్యక్రమంలో వివిధ ప్రాంతాల నుంచి కాపిరెడ్డి కృష్ణారెడ్డి, కోపల్లి జయకర్ బాబు, మల్లికార్జున రెడ్డి, విష్ణు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం స్వాధీనం

లక్ష్మీపురం: రేషన్ బియ్యాన్ని అరండల్‌పేట పోలీసులు బుధవారం స్వాధీనం చేసుకున్నారు. వివరాలు.. సంజీవయ్యనగర్ రైల్వే గేటు వద్ద మూడు ఆటోలలో సుమారు 200 బస్తాలలో బియ్యంను తరలిస్తున్న సమాచారం స్పెషల్ బ్రాంచ్ సిబ్బందికి రావడంతో అరండల్‌పేట పోలీసులకు సమాచారం ఇచ్చారు. తరలిస్తున్న బియ్యాన్ని, మూడు ఆటోలు, ఆటో డ్రైవర్లను స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

క్లుప్తంగా

వెండింగ్ కార్డు జారీ



నెహ్రూనగర్: గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో జీజీహెచ్ ఎదుట జీవనోపాధి కోసం టిఫిన్ బండి పెట్టుకోవడానికి అవకాశం కల్పించాలని కలెక్టర్‌ని కోరిన అలవాల రాధికకు నగర కమిషనర్ పులి శ్రీనివాసులు స్థలం కేటాయించడంతో పాటు వెండింగ్ జోన్ ఐడీ కార్డ్‌ని తూర్పు ఎమ్మెల్యే నసీర్‌తో కలసి రాధికకు అందజేశారు. ప్రస్తుతం వ్యాపారం చేసుకోవడానికి వీలు కల్పించినందున వెండింగ్ ఐడీ కార్డ్‌ని నగరపాలక సంస్థ ఉపా సెల్ ద్వారా అందించామన్నారు. సదరు ఐడీ కార్డ్ ద్వారా తన వ్యాపారానికి బ్యాంక్‌ల ద్వారా రుణాలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వీధి వ్యాపారులకు అందించే సంక్షేమ పథకాలకు అర్హత పొందే వీలు కలుగుతుందని చెప్పారు.

సుగుణ సైన్స్ అకాడమీకి అప్‌కాస్ట్ గుర్తింపు



గుంటూరు ఎడ్యుకేషన్: గుంటూరు జిల్లాకు చెందిన డాక్టర్ చివుకుల హనుమంతరావు చారిటబుల్ ట్రస్ట్ అనుబంధ సంస్థ సుగుణ సైన్స్ అకాడమీ (బాలల ప్రయోగ శాల)కు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాస్త్ర, సాంకేతిక మండలి (అప్‌కాస్ట్) గుర్తింపు కల్పించింది. ఈ మేరకు సంస్థ వ్యవస్థాపకుడు డాక్టర్ చివుకుల సాంబశివరావు అప్‌కాస్ట్ సీఈవో డాక్టర్ కె.శరత్‌కుమార్ నుంచి విజయవాడలోని కార్యాలయంలో బుధవారం ధ్రువీకరణ పత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా వివిధ పాఠశాలల డైరెక్టర్లు కాటూరి వెంకటేశ్వరరావు, మేకల రవీంద్రబాబు, పత్రి వేణుగోపాల్, ఉపాధ్యాయులు బృందం ఆయనకు అభినందనలు తెలిపారు.

కల్తీ మద్యంపై అప్రమత్తంగా ఉండాలి

నెహ్రూనగర్: ఆంధ్రప్రదేశ్ ఎక్సైజ్‌శాఖ ద్వారా లైసెన్స్ పొందిన రిటైల్ మద్యం దుకాణాల నుంచి మాత్రమే మద్యం కొనుగోలు దారులు మద్యం కొనుగోలు చేయాలని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ గుంటూరు సూపరింటెండెంట్ వి.అరుణకుమారి బుధవారం ఓ ప్రకటనలో తెలియజేశారు. వివాహాలు, పార్టీలు, ఇతర సామూహిక వేడుకల సందర్భాలలో మద్యాన్ని తగ్గింపు ధరలకు సరఫరా చేస్తామని చెప్పి మోసం చేసే అవకాశముందని హెచ్చరించారు. వారు సరఫరా చేసే మద్యం నకిలీది కావచ్చని.. దానిని తాగడం వలన ఆరోగ్యానికి హానికరమన్నారు. అటువంటి అనుమానిత వ్యక్తులు ఎక్కడైన కనిపిస్తే టోల్ ఫ్రీ నంబర్ 14405కి లేదా 9440902465 నంబర్‌కు ఫిర్యాదు చేయవచ్చని చెప్పారు.

9న సార్వత్రిక సమ్మె జయప్రదం చేయండి

లక్ష్మీపురం: దేశవ్యాప్తంగా కార్మికులు, కర్షకులు, ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి జూలై 9న నిర్వహించనున్న జాతీయ సార్వత్రిక సమ్మెకు భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) పూర్తిగా మద్దతు ఇస్తోందని రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జంగాల అజయ్ కుమార్ తెలిపారు. బుధవారం గుంటూరు కొత్తపేటలోని పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. పార్టీ కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొననున్నారని ఆయన వెల్లడించారు.

ఇద్దరు పాత నేరస్తులు అరెస్ట్



లక్ష్మీపురం: ఇద్దరు పాత నేరస్తులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పట్టాభిపురం సీఐ గంగా వెంకటేశ్వర్లు ఆదేశాల మేరకు మంగళవారం అర్ధరాత్రి విద్యానగర్‌లో కానిస్టేబుల్ జమ్ముల శ్రీనివాసరావు, హోంగార్డ్ గురవయ్య గస్తీ కాస్తున్న సమయంలో ఇద్దరు వ్యక్తులు అనుమానితులుగా కనిపించారు. ఫింగర్ ప్రింట్ ట్రేసింగ్ డివైజ్ ద్వారా వారి వ్రేలి ముద్రలను పరిశీలించారు. వారిని మంచికల్లు ప్రాంతానికి చెందిన బసవలింగయ్య, గుంటూరు మారుతీనగర్ ప్రాంతానికి చెందిన మోహన్ అనే పాత నేరస్తులుగా గుర్తించారు. తక్షణమే వారివురిని స్టేషన్‌కు తరించారు. పోలీస్ సిబ్బందిని డీఎస్పీ అరవింద్, సీఐ గంగా వెంకటేశ్వర్లు సత్కరించి రివార్డు అందజేశారు.

నాట్స్ సభలకు 'కాళహస్తి'



నగరంపాలెం: అమెరికాలో శుక్ర, శనివారాల్లో నిర్వహించనున్న ఉత్తర అమెరికా తెలుగు సంఘం(నాట్స్) సభలకు ఆహ్వానం అందినట్లు ఏపీ విశ్రాంత పోలీస్ అధికారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాళహస్తి సత్యనారాయణ తెలిపారు. బృందావన్‌గార్డెన్స్‌లోని కార్యాలయంలో బుధవారం మీడియాతో మాట్లాడారు. నాట్స్ అధ్యక్షుడు ప్రశాంత్, కార్యనిర్వాహక కార్యదర్శి శ్రీనివాస్ నుంచి ఆహ్వానం అందినట్లు చెప్పారు.

నగరంలో పారిశుద్ధ్యం నూరు శాతం మెరుగు

కమిషనర్ పులి శ్రీనివాసులు


సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్, పక్కన తూర్పు ఎమ్మెల్యే నసీర్

నెహ్రూనగర్: నగరంలో మైక్రో ప్లాన్ మేరకు నూరు శాతం మెరుగైన పారిశుద్ధ్యం అందించేలా ప్రజలు, ప్రజా ప్రతినిధులు, అధికారులు సమన్వయంతో కృషి చేస్తున్నట్లు నగర కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో గుంటూరు తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే నసీర్‌తో కలిసి, తూర్పు నియోజకవర్గంలో కార్పొరేటర్లు, ప్రజారోగ్య కార్యదర్శులు, ఇన్‌స్పెక్టర్లతో పారిశుద్ధ్యం మెరుగు కోసం ప్రత్యేక సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో ఎలక్షన్ డివిజన్ల వారీగా ఒక్కొక్క వార్డుని ఒక్కొక్క శానిటేషన్ డివిజన్‌గా చేస్తూ శానిటరీ సిబ్బందిని కేటాయించడం జరిగిందని వివరించారు. నగరంలో ప్రతి 350 ఇళ్లకు ఒక మైక్రో ప్యాకెట్ ఉంటుందని, మైక్రో ప్యాకెట్ ఇద్దరు కార్మికులని కేటాయించామని చెప్పారు. కార్మికులు ఉదయాన్నే 5.30కు హాజరు అనంతరం 350 ఇళ్ల పరిధిలోని రోడ్ల శుభ్రం చేసుకుంటారన్నారు. అనంతరం ఇళ్ల నుంచి తడి పొడిగా వేర్వేరుగా చెత్త కలెక్షన్ చేసుకోవాలని చెప్పారు. మధ్యాహ్నం తమ మైక్రో ప్యాకెట్ ప్రాంతంలోని డ్రెయిన్లను నూరు శాతం శుభ్రం చేసుకోవాలని కోరారు. క్షేత్ర స్థాయిలో కార్మికులు, కార్యదర్శుల పనితీరుపై ప్రజలు, ప్రజా ప్రతినిధుల నుంచి ఫిర్యాదులు అందుతున్నాయని, వారి పనితీరు పర్యవేక్షణకు ప్రతి వార్డుకు నగరపాలక సంస్థ నుంచి నోడల్ అధికారిని నియమించామని సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. రాబోయే నెలరోజుల్లో కమాండ్ కంట్రోల్ రూమ్‌ని సిద్ధం చేస్తున్నామని.. దాని ద్వారా ఏఐ టెక్నాలజీ, డ్రోన్ టెక్నాలజీ సాయంతో వర్కర్స్ హాజరు, క్షేత్ర స్థాయిలో పనితీరు, ప్రతి ఇంటి నుంచి చెత్త సేకరణ చేస్తుంది, లేనిదీ కెమెరాల ద్వారా పర్యవేక్షణ చేస్తామన్నారు. కార్పొరేటర్లు తమ డివిజన్లలో అవసరాల రీత్యా కార్మికుల సంఖ్య పెంచాలని కోరారని, అది కూడా పరిగణలోకి తీసుకుంటామని వెల్లడించారు. కమర్షియల్ సంస్థలు తప్పనిసరిగా కమర్షియల్ ఏజెన్సీలకే వ్యర్థాలు ఇవ్వాలని, అలా కాకుండా రోడ్లు, డ్రెయిన్లలో వేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో సీఎంఓహెచ్ డాక్టర్ అమృతం, ఎంహెచ్‌ఓ(ఇన్‌ఛార్జ్) జె.రామారావు, ఎస్ఎస్‌లు అయూబ్ ఖాన్, సాంబయ్య పాల్గొన్నారు.

నెహ్రూనగర్: నగరపాలక సంస్థ పరిధిలో ప్రధానంగా శివారు ప్రాంతాల్లో అవుట్ ఫాల్ డ్రెయిన్లు ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని, అంతర్గత డ్రెయిన్లు, మేజర్ డ్రెయిన్లలో కలిసే ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన మెష్‌ల వద్ద నిలిచే వ్యర్థాలను తొలగించాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశించారు. బుధవారం కమిషనర్ రెడ్డిపాలెం, విఘ్నేశ నగర్, పోస్టల్ కాలనీ, వర్కర్స్ కాలనీ తదితర ప్రాంతాల్లో పర్యటించి అభివృద్ధి, పారిశుద్ధ్య పనులను డ్రోన్ ద్వారా పరిశీలించి, తీసుకోవాల్సిన చర్యలపై సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. పర్యటనలో డీఈఈ రమేష్ బాబు, కార్పొరేటర్ కె.రంగారెడ్డి పాల్గొన్నారు.

వారాహి వైభవంపై ప్రవచనాలు ప్రారంభం



నగరంపాలెం: స్థానిక బృందావన్‌గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయం ప్రాంగణం అన్నమయ్య కళావేదికపై రెండు రోజులపాటు నిర్వహించనున్న వారాహి వైభవం ప్రవచనం బుధవారం ప్రారంభమైంది. ఆలయ పాలక మండలి ఉపాధ్యక్షులు లంకా విజయబాబు, సహాయ కార్యదర్శి వూటుకూరి నాగేశ్వరరావు, సుందర సత్సంగ్ సభ్యులు జ్యోతిప్రజ్వలనతో ప్రారంభించారు. సుందర సత్సంగ్ సభ్యులు కేవీ కోటేశ్వరరావు మాట్లాడుతూ భగవంతుడు ధర్మానికి హాని కలిగి, అధర్మం ప్రజ్వరిల్లినపుడు తనంతట తానే ధర్మరక్షణ కోసం అవతరిస్తారని పేర్కొన్నారు. రాక్ష సంహారం కోసం భగవంతుడు అనేక రూపాల్లో ఆవిర్భవిస్తారని అన్నారు. వారాహిదేవి ద్వాదశ నామాలను పఠించిన వారికి దేవి ప్రసన్నురాలై, వజ్రకౌచంలా కాపాడుతుందని అన్నారు. తద్వారా వారి దుఃఖాలను మాయం చేస్తుందన్నారు. కార్యక్రమంలో సుందర సత్సంగ్ సభ్యులు మన్నవ రవిప్రసాద్, పి.శివారెడ్డి, ఏకాంబరేశ్వరరావు, బసవేశ్వరరావు పాల్గొన్నారు.

మద్యం తాగి బైక్ నడిపితే చర్యలు

లక్ష్మీపురం: మద్యం తాగి వాహనాలు నడిపితే చట్టపరమైన చర్యలు ఉంటాయని వెస్ట్ సబ్ డివిజన్ డీఎస్పీ కె.అరవింద్ హెచ్చరించారు. చుట్టుగుంట సెంటర్ వద్ద బుధవారం రాత్రి డ్రంకన్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ అరవింద్ మాట్లాడుతూ మద్యం తాగి వాహనాలు నడుపుతున్న వారిని గుర్తించి కేసులు నమోదు చేశారు. వాహనాలను తనిఖీలు చేసిన వారిలో సీఐ నజీర్ బేగ్, నగరంపాలెం ఎస్ఐ రాంబాబు ఉన్నారు.

నిబంధనలు పాటించని వాహనదారులపై చర్యలు



పట్నంబజారు: నిబంధనలకు విరుద్ధంగా విద్యార్థులను వాహనాల్లో పరిమితికి మించి ఆటోల్లో తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఈస్ట్ ట్రాఫిక్ సీఐ ఎ.అశోక్ హెచ్చరించారు. బుధవారం ఈస్ట్ సబ్ డివిజన్ పరిధిలో ప్రత్యేక తనిఖీలు చేపట్టారు. స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా ఓవర్ లోడు, ఓవర్ స్పీడ్, ఓవర్‌టేక్, లైసెన్సు లేకుండా నడుపుతున్న వాహనాలు, ధృవీకరణ పత్రాలులేని పాఠశాల, కళాశాలలకు చెందిన వాహనాలపై చలానా విధించారు. పది వాహనాలకు రూ. 20వేలు అపరాధ రుసుము విధించారు. ట్రాఫిక్ సీఐ అశోక్‌కుమార్ మాట్లాడుతూ ప్రతి ఒక్క డ్రైవర్ ధ్రువీకరణ పత్రాలు కలిగి ఉండాలని సూచించారు. ఆటోలు, తదితర మిని క్యాబ్‌ల వారు విద్యార్థులను అధిక సంఖ్యలో ఎక్కించుకుంటే వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

రేకుల షెడ్‌ను కూల్చేశారు



నెహ్రూనగర్: టీడీపీ నాయకుడి ఇంటిలోకి గాలి రావాడంలేదనే కారణంతో సదరు నాయకుడి ఇంటిని అనుకోని ఉన్న రేకుల షెడ్‌ని నగరపాలక సంస్థ పట్టణ ప్రణాళిక అధికారులు బుధవారం సాయంత్రం కూల్చివేసిన ఘటన గుంటూరు నగర పరిధిలో 28వ వార్డు వెంకటరమణ కాలనీలో రెండవ లైనులో చోటుచేసుకుంది. జీవనోపాధి కోసం ప్రకాశం జిల్లా మార్కాపురం నుంచి గుంటూరుకి వచ్చి తిని తినక కూడబెట్టుకుని ఇల్లు కట్టుకుంటే ఆ ఇంటి వెనుక ఉండే టీడీపీ వ్యక్తి ఇంటికి కేవలం గాలి రావడం లేదనే కారణంతోనే కర్రీస్ వ్యాపారం చేసుకునే రేకుల షెడ్‌ని కూల్చివేయడంపై దూమారం రేగింది. నగర మేయర్‌తో పాటు పశ్చిమ ఎమ్మెల్యే నుంచి వచ్చిన వత్తిళ్ల కారణంగానే నగరపాలక సంస్థ అధికారులు ఈ దుశ్చర్యకు పాల్పడినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

విద్యార్థుల ఆలోచనా విధానం ఉన్నతంగా ఉండాలి


మాట్లాడుతున్న మల్లీశ్వరి

గుంటూరు ఎడ్యుకేషన్: విద్యార్థుల ఆలోచనా విధానం ఉన్నతంగా ఉండాలని కెరీర్ కౌన్సెలింగ్ శిక్షకురాలు మల్లీశ్వరి పేర్కొన్నారు. బుధవారం జిల్లా యువజన సర్వీసుల శాఖ(స్టెప్-స్వశక్తి) ఆధ్వర్యంలో జేకేసీ కళాశాలలో విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసం, కెరీర్ మార్గదర్శకాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ పి.గోపీచంద్ అధ్యక్షత వహించారు. ఆమె మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు ఆచరణ సాధ్యమైన ఆలోచనా విధానంతో జీవితంలో ముందుకు వెళ్లాలని సూచించారు. సృజనాత్మక శక్తిని మేల్కొలిపి భవిష్యత్‌ను తీర్చిదిద్దుకుని, ఉన్నతస్థాయికి ఎదగాలన్నారు. జిల్లా ఉపాధి కల్పనాధికారి భరద్వాజ్ మాట్లాడుతూ ఉన్నత విద్య ద్వారా వచ్చే ఉద్యోగావకాశాలను గురించి వివరించారు. యువజన సర్వీసుల శాఖ మేనేజర్ బి.రాధిక మాట్లాడుతూ జిల్లా యువజన సర్వీసుల శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు కెరీర్ కౌన్సెలింగ్, వ్యక్తిత్వ వికాసం, ఉన్నత విద్య, ఉద్యోగావకాశాలపై అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. మానసిక శాస్త్ర నిపుణులు, మోటివేషనల్ స్పీకర్స్‌తో చైతన్యవంతులను చేస్తున్నట్లు చెప్పారు.

రంగరాజును కలిసిన మాధవ్



గుంటూరు మెడికల్: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నికైన పి.వి.ఎన్.మాధవ్ బుధవారం బీజేపీ సీనియర్ నాయకుడు జూపూడి రంగరాజును మర్యాదపూర్వకంగా కలిశారు. గుంటూరు రైలుపేటలోని నివాసానికి విచ్చేసి జనసంఘ్ నాయకుడు మాజీ ఎమ్మెల్సీ జూపూడి యజ్ఞ నారాయణ సతీమణి జూపూడి హైమవతమ్మ ఆశీస్సులు పొందారు. మాధవ్‌తో పాటు బీజేపీ జిల్లా అధ్యక్షుడు చెరుకూరి తిరుపతిరావు, కొత్తూరి వెంకట సుబ్బారావు, యడ్లపాటి స్వరూపరాణి, నేరెళ్ల మాధవరావు, భీమినేని చంద్రశేఖర్, పాలపాటి రవికుమార్, వెలగలేటి గంగాధర్, చరక కుమార్ గౌడ్, వై.వి.సుబ్బారావు, రాచుమల్లు భాస్కర్, సురేష్ జైన్, బజరంగ్ రామకృష్ణ, నడ్డి నాగమల్లేశ్వరి, దేసు సత్యనారాయణ, బొల్లాప్రగడ శ్రీదేవి, జితేంద్ర గుప్తా, ఇండ్ల శ్రీధర్, వీరమణింద్ర, దర్శనపు శ్రీనివాస్, దారా అంబేద్కర్, స్టాలిన్ ఉన్నారు.

కొరటాల స్ఫూర్తితో యువత పనిచేయాలి

సీపీఎం జిల్లా కార్యదర్శి వై.నేతాజీ


కొరటాల చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

లక్ష్మీపురం: దివంగత కొరటాల సత్యనారాయణ స్ఫూర్తితో మతోన్మాద, కార్పొరేట్ శక్తులకు వ్యతిరేకంగా ఉద్యమించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వై.నేతాజీ పిలుపునిచ్చారు. గుంటూరు బ్రాడీపేటలోని పార్టీ జిల్లా కార్యాలయంలో కొరటాల సత్యనారాయణ వర్ధంతి బుధవారం నిర్వహించారు. తొలుత చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థి ఉద్యమం నుండి తన రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించి అంచెలంచెలుగా ఎదిగి శాసన సభ్యునిగా అన్ని వర్గాల ప్రజల సమస్యలను చట్ట సభల్లో ప్రస్తావించి పరిష్కారానికి పూనుకున్నారన్నారు. ఆయన ఆశయ సాధన కోసం నేటి తరం పట్టుదలతో కృషి చేయాలని కోరారు. సీపీఎం జిల్లా నాయకులు పాశం రామారావు, నగర కార్యదర్శి ఎన్.నళినీకాంత్, ఈమని అప్పారావు, కె.నాగేశ్వరరావు, బెర్రగాని శ్రీనివాసరావు, వై.కష్ణకాంత్, ఎస్.పద్మ, కె.శ్రీనివాస్, కళ్యాణి, వెంకటరావు పాల్గొన్నారు.

పట్టాభిపురం పోలీస్ స్టేషన్ తనిఖీ


పట్టాభిపురం పోలీస్ స్టేషన్‌లో రికార్డులు తనిఖీ చేస్తున్న జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్

లక్ష్మీపురం: గుంటూరు వెస్ట్ సబ్ డివిజన్ పరిధిలోని పట్టాభిపురం పోలీస్ స్టేషన్‌ను జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ బుధవారం తనిఖీ చేశారు. స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్ల గురించి వెస్ట్ సబ్ డివిజన్ డీఎస్పీ కె.అరవింద్, సీఐ గంగా వెంకటేశ్వర్లు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మీడియాతో ఆయన మాట్లాడుతూ వార్షిక తనిఖీల్లో భాగంగా పట్టాభిపురం పోలీస్ స్టేషన్‌లో తనిఖీ నిర్వహించడం జరిగిందన్నారు. జూలై 5వ తేదీ జాతీయ లోక్ అదాలత్ సందర్భంగా పరిష్కరించే అవకాశం ఉన్న కేసులపై సమీక్ష చేసినట్లు చెప్పారు. నైట్ బీట్ సమర్థంగా నిర్వహించాల్సిందిగా సూచించారు. ఎలాంటి అవినీతికి తావు లేకుండా స్టేషన్‌కు వచ్చే బాధితులతో మర్యాదగా ప్రవర్తించి వారికి వీలు అయినంత వరకు సహాయం చేయాల్సిన బాధ్యత కలిగి ఉండాల్సిందిగా తెలిపారు. జిల్లా ఎస్పీ తనిఖీలలో వెస్ట్ డీఎస్పీ కె.అరవింద్, స్పెషల్ బ్రాంచ్ సీఐ ఎ.శ్రీనివాసరావు, స్టేషన్ సీఐ గంగా వెంకటేశ్వర్లు, ఎస్ఐలు నరహరి, సుబ్బారావు, తరంగిణీ, ఆంజనేయులు పాల్గొన్నారు.

కేర్ వెల్ హాస్పిటల్‌లో అత్యాధునిక వైద్య సేవలు

డాక్టర్ నాగూర్‌బాషా


కేక్ కట్ చేస్తున్న దృశ్యం

గుంటూరు మెడికల్: నగరంలో అతి తక్కువ ఖర్చుతో అత్యాధునిక వైద్య సేవలు అందిస్తూ అందరి మన్ననలను పొంది మూడో వార్షికోత్సవం, డాక్టర్స్ డే సందర్భంగా కేర్ వెల్ హాస్పిటల్‌లో ఉచిత ఓపీ సేవలు, అన్ని రకాల వైద్య పరీక్షలపై ప్రత్యేక రాయితీ ఇస్తున్నట్లు ప్రముఖ గ్యాస్ట్రో ఎంటరాలజిస్ట్ డాక్టర్ షేక్ నాగూర్ బాషా తెలిపారు. వార్షికోత్సవం సందర్భంగా కేక్ కట్ చేశారు. ఆయన మాట్లాడుతూ మానవతా దృక్పథంతో సమాజంలోని ప్రజలకు సేవ చేయాలనే ఉద్దేశంతో మూడేళ్ల క్రితం డాక్టర్స్ డే రోజు గుంటూరు నగరంలో కేర్ వెల్ హాస్పిటల్ ప్రారంభించడం జరిగిందని తెలిపారు. మూడేళ్ల నుంచి అతి తక్కువ ఖర్చుతో అత్యాధునిక వైద్య సేవలు అందిస్తున్నట్లు వెల్లడించారు. గ్యాస్ట్రోఎంట్రాలజీకి వ్యాధులకు అత్యాధునిక పరికరాలు, సాంకేతిక పరిజ్ఞానంతో అన్ని రకాల వైద్య సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. కేర్ వెల్ హాస్పిటల్‌లో ఈఎన్‌టీ, కార్డియాలజీ, న్యూరాలజీ, యూరాలజీకి సంబంధించిన ప్రముఖ వైద్యులతో వైద్య సేవలను అందించటం జరుగుతుందన్నారు. ప్రముఖ వైద్యులతో లివర్ అండ్ గ్యాస్ట్రో ఎంటరాలజీ, ఎముకలు, కీళ్ల మార్పిడి వైద్య సేవలు, చెవి, ముక్కు, గొంతుకు సంబంధించిన వైద్య సేవలను గుంటూరు, పరిసర ప్రాంత ప్రజలందరూ వినియోగించుకోవాలన్నారు.

నిరసనలపై ఆంక్షలు ఎత్తివేయాలి

లక్ష్మీపురం: జిల్లాలో సెక్షన్ 30 పోలీస్ యాక్ట్ నిరంతరం శాశ్వతంగా అమలులో ఉంటుందని జిల్లా ఎస్పీ ప్రకటించడాన్ని సీపీఎం జిల్లా కార్యదర్శి వై.నేతాజీ ఖండించారు. బ్రాడీపేటలోని పార్టీ కార్యాలయంలో బుధవారం ఆయన మాట్లాడారు. జిల్లా పోలీసు అధికారుల ప్రకటన ప్రకారం సభలు, సమావేశాలు, ర్యాలీలు, ఊరేగింపులు, నిరసనలు, బంద్‌లు చేయాలంటే వారం రోజులు ముందుగానే పోలీసుల అనుమతి తీసుకోవాలని ప్రకటించడమే కాక ఇలాంటి నిరంకుశ విధానాలు శాశ్వతంగా అమలులో ఉంటాయని చెప్పడం ప్రజాస్వామికవాదుల గొంతునొక్కడే అవుతుందని పేర్కొన్నారు.